


మన
# భానుపురి
ఇది సూర్యాపేట వార్తల ఉషాకిరణం




గురువారం 28 మే 2026 | ఎడిటర్ :- బచ్చు పురుషోత్తం | పేజీలు :- 2

## నేరాల నిరోధం, ప్రజల కు భరోసా కల్పించడానికి పోలీస్ పటిష్ట చర్యలు







భానుపురి/సూర్యాపేట ప్రతినిధి

అక్రమ రవాణా అసాంఘిక కార్యకలాపాలు అరికట్టడం, నేరాలు నిరోధించడం, ప్రజలకు మెరుగైన భద్రత కల్పించి భరోసా కల్పించడం, బక్రీద్ పండగ సందర్భంగా పశువులు, గోవుల అక్రమ రవాణాను నిరోధించడం లక్ష్యంగా సూర్యాపేట జిల్లా వ్యాప్తంగా 26 పోలీస్ స్టేషన్ల పరిధిలో ఏకకాలంలో 23 ప్రత్యేక ప్రాంతాల్లో, 9 చెక్ పోస్ట్ లలో పోలీస్ నాఖాభందీ, కట్టడి ముట్టడి చేసి తనిఖీలు నిర్వహించడం జరిగినది, అంతర్ రాష్ట్ర, అంతర్ జిల్లా సరిహద్దు ల్లో క్షుణ్ణంగా తనిఖీలు చేశారు. సూర్యాపేట జిల్లా కేంద్రం ఖమ్మం రోడ్ లో అమ్మ గార్డెన్ వద్ద నాఖాభందీ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ తేజస్ నందులాల్ పవార్, జిల్లా ఎస్పీ నరసింహ లు పరిశీలించి ప్రయాణికులు ప్రయాణిస్తున్న బస్సులో తనిఖీలు చేసి ప్రయాణికులతో మాట్లాడారు, భద్రత రక్షణ అంశాల పట్ల రోడ్డుపై ప్రయాణ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల పట్ల వాహనదారులకు, ప్రయాణికులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ తేజస్ నంద లాల్ పవార్ ఐఎఎస్ గారు మాట్లాడుతూ జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఏకకాలంలో 26 పోలీస్ స్టేషన్ల పరిధిలో 23 ప్రత్యేక ప్రాంతాలలో 9 అంతర్రాష్ట్ర అంతర్ జిల్లా చెక్పోస్టులో ఏకకాలంలో తనిఖీలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. ఈ తనిఖీల ద్వారా తప్పులు చేసే వారికి భయం ఏర్పడుతుందని సామాన్య ప్రజానీకానికి ధైర్యం, భరోసా కలుగుతుందని తెలిపారు. పోలీస్ శాఖ ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజలకు మెరుగైన భద్రత రక్షణ కల్పిస్తుందని అన్నారు. ఈ తనిఖీల ద్వారా అక్రమ రవాణా అసాంఘిక కార్యకలాపాలను నిరోధించవచ్చని దొంగతనాలు నేరాలను అరికట్టవచ్చని అన్నారు. సమస్యలు ఉంటే ప్రజలు డయల్ 100 కు ఫోన్ చేసి ఫిర్యాదులు చేయవచ్చని తెలిపారు. ఈ తనిఖీల ద్వారా వాహనదారుల్లో అప్రమత్తత పెరుగుతుందని రోడ్డు ప్రమాదాలు జరగకుండా ఈ చర్యలు ఉపయోగ పడతాయని అన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సమస్యలపై ఫిర్యాదులు అందిన వెంటనే పోలీసులు ప్రజల ఇంటి వద్దకే వచ్చి ఫిర్యాదులు స్వీకరించి ఇంటి వద్ద నుండి కేసులు నమోదు చేస్తున్నారని ప్రజలు పోలీస్ స్టేషన్ల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదని అన్నారు. ఈ తనిఖీల వల్ల ప్రజల్లో భరోసా కలుగుతుందని తెలియజేశారు. అనంతరం జిల్లా ఎస్పీ నరసింహ మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన రక్షణ భద్రత కల్పించి అసాంఘిక కార్యకలాపాలు అక్రమ రవాణా, నేరాలు నిరోధించడం, బక్రీద్ పండగ సందర్భంగా పశువులు గోవుల అక్రమ రవాణాను నిరోధించడం లక్ష్యంగా జిల్లాలోకి వచ్చి పోయే అన్ని మార్గాలలో ఏకకాలంలో 23 ప్రత్యేక ప్రాంతాల్లో, 9 చెక్ పోసస్ట్ లలో క్షుణ్ణంగా తనిఖీలు చేయడం జరిగినది అన్నారు. ప్రజలకు మెరుగైన భద్రత, రక్షణ కల్పించడం, విజిబుల్ పోలీసింగ్, ఎఫెక్టివ్ పోలీసింగ్ నిర్వహించడం జరిగినది అన్నారు. అసాంఘిక కార్యకలాపాలు, అక్రమ రవాణా, అంతరాష్ట్ర నేరస్తుల కదలికలు, గంజాయి రవాణా, పశువుల అక్రమ రవాణా, పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా ను ఈ తనిఖీల ద్వారా అరికట్టవచ్చని అన్నారు. ఈ తనిఖీల ద్వారా ప్రజల్లో భరోసా ఏర్పడుతుందని తెలిపారు. జిల్లా పోలీస్ శాఖ అనుక్షణం ప్రజల రక్షణలో పనిచేస్తుందని ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటున్నామని అన్నారు సమస్యలు ఉంటే నేరుగా పోలీసులను సంప్రదించవచ్చని లేదా డయల్ 100 ద్వారా పోలీసులకు ఫిర్యాదు చేయవచ్చు అని అన్నారు.సూర్యాపేట పట్టణం అమ్మ గార్డెన్ వద్ద జరిగిన తనిఖీలలో డిఎస్పీ నరసింహ చారి, రిజర్వ్ ఇన్స్పెక్టర్ లు ప్రవీణ్ కుమార్, జానయ్య, పట్టణ ట్రాఫిక్ ఎస్ఐ సాయిరాం, పట్టణ ఎస్ఐలు శివతేజ వెంకన్న పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## పేదల మొహంలో చిరునవ్వు చూడటమే మా ప్రజా ప్రభుత్వ లక్ష్యం





భానుపురి/సూర్యాపేట రూరల్

ఇండ్లు లేని ప్రతి నిరుపేదకు పక్కా ఇండ్లు కట్టించి ఇవ్వడమే ప్రభుత్వ లక్ష్యమని, అర్హులైన ప్రతీ ఒక్కరికి దశలవారీగా ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామని ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి జిల్లా కాంగ్రెస్ నాయకులు మొరిశెట్టి లక్షాది తెలిపారు.బుధవారం సూర్యాపేట పట్టణంలోని 13వ వార్డు బాషా నాయక్ తండ లో బాలెంల విజయలక్ష్మి ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ డబుల్ బెడ్రూం ఇండ్లు కట్టిస్తామని చెప్పి పదేళ్లు ఊరించిన గత ప్రభుత్వం ఒక్కరికైనా పక్కా ఇల్లు ఇవ్వలేదని మండిపడ్డారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన రెండేళ్లలో ప్రతి నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేసిందని గుర్తుచేశారు. ప్రతీ ఏడాది నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇండ్ల చొప్పున మంజూరు చేసి ప్రతి పేదోడికి పక్కా ఇల్లు నిర్మించి ఇస్తామని చెప్పారు.ఇందిరమ్మ రాజ్యంలో పేదల సొంతింటి కల నెరవేరుతోంది. పేద ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యం. పేదల ముఖంలో చిరునవ్వు చూడటమే ప్రజా ప్రభుత్వ ధ్యేయం" అని పేర్కొన్నారు.గత పాలకులు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు అని చెప్పి పేదలకు ఒక్క ఇల్లు కూడా మంజూరు చేయకుండా ప్రజలను మోసం చేశారని విమర్శించారు. కానీ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పేదలకు నిజమైన న్యాయం జరుగుతోందని స్పష్టం చేశారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా అర్హులైన ప్రతి పేద కుటుంబానికి సొంతింటి కలను సాకారం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. రానున్న రోజుల్లో మరింత మంది పేదలకు ఈ పథకం ద్వారా లబ్ధి చేకూరుతుందని సర్వోత్తమ్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు యండి అంజద్ అలి, జిల్లా కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ అబ్దుల్ రహీం, 13వ వార్డు కౌన్సిలర్ భూక్య కౌసల్య, భూక్య మహేష్, 13వ వార్డు కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉగ్గం బుచ్చిరాములు, రవి నాయక్, నిరుడు విజయ్, రావుల జానయ్య, రాజు, సతీష్, వేణు,సాయి, రమేష్, అశోక్ శ్రీ దండు మైసమ్మ దేవస్థానం చైర్మన్ తంగేళ్ల కరుణాకర్ రెడ్డి, జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు ఏలిమినేటి అభినయ్ నాయుడు, జిల్లా కాంగ్రెస్ నాయకులు అబ్బాస్, సికందర్, రసూల్ తదితరులు పాల్గొన్నారు.

## అకాల వర్షాలతో తడిసినా ధాన్యం కొంటాం

భానుపురి/ఆత్మకూరు (ఎస్)



ధాన్యం సేకరణ ప్రక్రియలో క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న అడ్డంకులను అధిగమిస్తూ, ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతున్నామని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ పేర్కొన్నారు. బుధవారం ఆయన జిల్లా ఎస్పీ కే. నరసింహతో కలిసి ఆత్మకూరు (ఎస్) మండల కేంద్రంలోని పివైఆర్ రైస్ మిల్లును, ఏపూరు గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలనుఆకస్మికంగా సందర్శించారు. క్షేత్రస్థాయిలో కొనుగోలు తీరును, తూకాలను పరిశీలించి రైతులతో మాట్లాడారు ధాన్యం కొనుగోళ్లలో ప్రధానంగా ఎదురవుతున్న లారీల కొరత, హమాలీల ఇబ్బందులు మరియు అన్‌లోడింగ్ ఆలస్యం వంటి సమస్యలను గుర్తించామని, వాటి పరిష్కారానికి యుద్ధప్రతిపాదికన చర్యలు చేపట్టామని కలెక్టర్ తెలిపారు.రవాణా, పోలీస్ శాఖల సమన్వయంతో అన్ని రకాల వాహనాలను ధాన్యపు రవాణాకు మళ్లించడం జరుగుతుందని, ప్రతి రైస్ మిల్లుకు ఒక ప్రత్యేక ఇన్‌ఛార్జ్ నియామకం, అదనపు హమాలీల ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ప్రస్తుత అకాల వర్షాల నేపథ్యంలో జిల్లా యంత్రాంగం అలర్ట్ మెకానిజం'సిద్ధం చేసిందని కలెక్టర్ తెలిపారు.అకాల వర్షాల వల్ల ధాన్యం తడిస్తే రైతులు అస్సలు ఆందోళన చెందవద్దని, తడిసిన ధాన్యాన్ని వెంటనే గుర్తించి, బాయిల్డ్ రైస్ మిల్లులకు తరలించేలా జిల్లా యంత్రాంగం ముందస్తు చర్యలు తీసుకుందని. రైతులకు నష్టం జరగనివ్వమని కలెక్టర్ అన్నారు.రెవెన్యూ, సివిల్ సప్లై, పోలీస్ శాఖలు పరస్పరం సమన్వయం చేసుకుంటూ ధాన్యం సేకరణను వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక కోఆర్డినేటర్లు క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. ఈ పర్యటనలో కలెక్టర్ వెంట డి ఆర్ డి ఓ సన్యాసయ్య, ఆత్మకూర్ (ఎస్) తహసిల్దార్ హామీన్ సింగ్, ఎంపీడీవో అసీం అలీ, ఏవో దివ్య ఇతర స్థానిక అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.




## మహిళల్లో ఆనందం నింపిన ఇందిరమ్మ చీరలు



భానుపురి /సూర్యాపేట టౌన్

మహిళల ముఖాల్లో ఆనందం చూడాలనే లక్ష్యంతో ఇందిరమ్మ చీరలు పంపిణీ చేస్తున్నామని మున్సిపల్ చైర్మన్ మొరిశెట్టి నివేదిత లక్షాధి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని 31 వ వార్డులో కౌన్సిలర్ కొండపల్లి దిలీప్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమంలో వారు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహిళల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని తెలిపారు. మహిళల ముఖాల్లో ఆనందం చూడాలనే లక్ష్యంతో ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. అర్హతలు ఉన్న ప్రతి మహిళకు చీర అందేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. మహిళల ఆత్మగౌరవాన్ని పెంపొందించే దిశగా ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో జ్యోతుల శ్రీనివాస్, ఓంకార్, భార్గవ్, వెంకట్రావు, భిక్షం నాయక్, తాడూరి లింగయ్య, శంకర్, సుధాకర్ రెడ్డి, వార్డ్ ఆఫీసర్ శ్రీనాథ్, ఆర్పి కవిత తదితరులు పాల్గొన్నారు.

## 1950 నాటి రాష్ట్రపతి ఉత్తర్వులు వెంటనే రద్దు చేయాలి

భానుపురి/తిరుమలగిరి



తిరుమలగిరి మున్సిపాలిటీ పట్టణ కేంద్రం ఎక్స్ రోడ్డు నందు ,తెలంగాణ రాష్ట్ర క్రిస్టియన్ మైనారిటీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు ఇరుగు సంసోను ఆధ్వర్యంలో జరిగిన విలేకరుల సమావేశంలో తెలంగాణ రాష్ట్ర క్రిస్టియన్ మైనారిటీ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బిషప్ దుర్గం ప్రభాకర్ పాల్గొని వారు మాట్లాడుతూ దళిత క్రైస్తవులకు విద్యా,వైద్య, సామాజిక ,సాంస్కృతిక , ఆర్థిక పరిస్థితులు ఈ దేశంలో పేర్కొంటూన్నామని ఎస్సీ హోదా మరియు రాజ్యాంగ హక్కులను కల్పించాలని,అది రాజ్యాంగం కల్పించిన హక్కు గా డిమాండ్ చేశారు.గతంలో భారత ప్రభుత్వం రంగనాథ్ మిశ్రా జాతీయ కమిషన్ (2004)ను ఏర్పాటు చేసిందనీ మాజీ సీజేఐ రంగనాథ్ మిశ్రా అధ్యక్షతన, ఇది 2007లో దళిత క్రైస్తవులు వివక్షను ఎదుర్కొంటున్నారని నివేదికను ప్రభుత్వంనకు సమర్పించారనీ దానిని వెంటనే అమలు చెయ్యాలని డిమాండ్ చేశారు. మరియు 1950 నాటి రాష్ట్రపతి ఉత్తర్వులు రద్దు చేయాలనీ డిమాండ్ చేశారు .ఈ కార్యక్రమం లో బిషప్ ముల్లంగి జాకబ్ రాజు, బ్రదర్ జాటోత్ డేవిడ్ నాయక్, దారావత్ రవీందర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు

## వార్డు మహిళలకు చీరల పంపిణీ

భానుపురి/సూర్యాపేట టౌన్




పట్టణంలోని 24 వ వార్డులో ఇందిరమ్మ చీరలు పంపిణీ కార్యక్రమాన్ని వార్డు కౌన్సిలర్ మన్నెం అరుణ మల్లేష్ యాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వార్డులో తెల్ల రేషన్ కార్డు కలిగినటువంటి మహిళలకు ఇందిరమ్మ చీరలను పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. ప్రతి ఒక్క మహిళకు ఇందిరమ్మ చీర అందే విధంగా పంపిణీ చేస్తామని అన్నారు. తమ వార్డులో ఎక్కువగా నిరుపేద మహిళలు ఉన్నారని వారికి ప్రభుత్వ కార్యక్రమాలు వివరించి అరులైన వారిని దరఖాస్తు చేసుకునే విధంగా వారికి సమాచారం అందజేస్తునట్లు చెప్పారు. వార్డులో ఎక్కువగా పెన్షన్ దారులు దూర ప్రాంతానికి వెళ్లి పెన్షన్ తీసుకోవడం ఇబ్బంది పడుతున్నారని, అందువలన తమ ఇంటి పక్కన ఉన్న ఖాళీ స్థలంలో చుట్టుపక్కల నాలుగు వార్డుల వారికి పెన్షన్లు లభించే విధంగా ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో వార్డుకు చెందిన నాయకులు పిల్లల ఉపేందర్, బెంజారపు కరుణాకర్, ఎడ్లమల్ల సన్నీ, ఎండి ఖలీల్, పరసబోయిన నాగయ్య, అంజయ్య, శివ, పోతనబోయిన శ్రవణ్, అల్లి మురళి, డీజే నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళా సాధికారతకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉంది

భానుపురి/సూర్యాపేట టౌన్

సూర్యాపేట పట్టణంలోని 19వ వార్డు భగత్ సింగ్ నగర్ లో వార్డు కౌన్సిలర్ పిడమర్తి కీర్తి లవన్ ఆధ్వర్యంలో పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు యండి అంజద్ అలి అధ్యక్షతన ఏర్పాటు చేసిన ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి రాష్ట్ర కాంగ్రెస్ సీనియర్ నాయకులు పోతు భాస్కర్ మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి మాట్లాడుతూ ఇందిరమ్మ స్ఫూర్తితో మా ప్రభుత్వం ముందుకు వెళుతోంది. మహిళలకు పెట్రోల్ బంక్ లు నిర్వహించుకునేలా ప్రోత్సహించాంఆర్టీసీలో వెయ్యి బస్సులకు మహిళలని యజమానులను చేశాం . మహిళల సంక్షేమంతో పాటు ఆర్థిక ఉన్నతి కలిగించే కార్యక్రమాలు చేపట్టాం .ఆడబిడ్డల పేరుతోనే ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తున్నాం రాజకీయాల్లోనూ మహిళలకు తగిన ప్రాధాన్యత కల్పించాం. కోటి మంది ఆడబిడ్డలను కోటీశ్వరులని చేయాలని లక్ష్యంగా పెట్టుకుని ప్రభుత్వం పనిచేస్తుంది. తెలంగాణ ఆడబిడ్డలకు ప్రభుత్వం తరపున సారె పెట్టి గౌరవించాలని భావించాం అన్నారు. మహిళల సంక్షేమం కోసం ప్రభుత్వం రానున్న రోజుల్లో మరిన్ని సంక్షేమ పథకాలను తీసుకురానుంది అని అన్నారు. అర్హులైన ప్రతి



మహిళకూ ఈ సంక్షేమ పథకాలు అందేలా నేను మన ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తామని ఈ సందర్భంగా హామీ ఇస్తున్నాను అని అన్నారు. అందుకే కోటి మంది ఆడబిడ్డలకు కోటి చీరలు పంపిణీ చేయాలని నిర్ణయించాం అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ నిమ్మల వెంకన్న, 19వ వార్డు కాంగ్రెస్ నాయకులు బొప్పాని శ్రీకాంత్, తాటి విజయ శ్రీ, పట్టణ మైనార్టీ సెల్ అధ్యక్షుడు గౌస్, 19వ వార్డు నాయకులు పృథ్వీ రెడ్డి, భాగ్య రాజ్, మున్సిపల్ కౌన్సిలర్ కొండపల్లి దిలీప్ రెడ్డి, జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు ఏలిమినేటి అభినయ్ నాయుడు, శ్రీ దండు మైసమ్మ దేవస్థానం చైర్మన్ తంగేళ్ల కరుణాకర్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి అబుబకర్ సిద్దిక్, జిల్లా కాంగ్రెస్ నాయకులు సాజిద్ ఖాన్, మద్దెబోయిన శ్రీనివాస్, సాజిద్ నీడ్స్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళల కళ్లల్లో ఆనందం చూడడమే ప్రభుత్వ లక్ష్యం

భానుపురి/సూర్యాపేట టౌన్




మహిళల ఆర్థికాభివృద్ధి, సాధికారతే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాద్రి లు అన్నారు. బుధవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని 22, 23 వార్డుల్లో నిర్వహించిన ఇందిరమ్మ నారీ శక్తి చీరల పంపిణీ కార్యక్రమాన్ని వారు ప్రారంభించి మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం మహిళల కళ్లల్లో ఆనందం చూడాలనే సంకల్పంతో ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టిందని తెలిపారు. బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి ఇందిరమ్మ పేరుతో మహిళలకు చీరలు పంపిణీ చేయడం గర్వకారణమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. సూర్యాపేటకు ఇప్పటికే 38,500 చీరలు సిద్ధంగా ఉన్నాయని, అవసరమైతే మరిన్ని కూడా తీసుకువస్తామని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర చిహ్నమైన పాలపిట్ట రంగుతో రూపొందించిన ఈ చీరలు మహిళల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయని అన్నారు. ప్రతి అర్హ త గల మహిళకు చీర అందేలా కౌన్సిలర్లు, ఆర్పీలు బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. మహిళ ఓ శక్తి మాత్రమే కాదని, ఆలోచన ఉన్న వ్యక్తి అని, కుటుంబాన్ని ఆర్థికంగా నిలబెట్టే శక్తి మహిళకే ఉందన్నారు. మహిళా సంఘాలకు డైరీ ఫామ్‌లు, గోదాములు, రైస్ మిల్లుల నిర్వహణ వంటి అవకాశాలను ప్రభుత్వం కల్పించేందుకు చర్యలు తీసుకుంటోందని తెలిపారు. సూర్యాపేటలో 27 వేల మహిళా సంఘాలు 95 నుంచి 100 మంది ఆర్పీలు పనిచేయడం ఇక్కడ మహిళల్లో ఉన్న చైతన్యానికి నిదర్శనం అని కొనియాడారు. దామన్న బిడ్డగా తాను ఇక్కడే అందరికీ అందుబాటులో ఉంటున్నానని ఏ అర్ధరాత్రి ఆపద వచ్చిన ఆడపిల్లలకు అండగా కొట్లాడుతానన్నారు. సూర్యాపేటలో వేలాది మహిళా సంఘాలు, వందకు చేరువలో ఆర్పీలు పనిచేయడం మహిళల్లో ఉన్న చైతన్యానికి నిదర్శనమన్నారు. మహిళలకు ఎలాంటి ఇబ్బంది వచ్చినా అండగా నిలుస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ హన్మంతరెడ్డి, పిసిసి ప్రధాన కార్యదర్శి చకిలం రాజేశ్వరరావు, డీసీసీ అధ్యక్షుడు గుడిపాటి నర్సయ్య, మున్సిపల్ వైస్ చైర్మన్ యండి షఫీ ఉల్లా, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు యండి అంజద్ అలి, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కుమ్మరికుంట్ల వేణుగోపాల్, కౌన్సిలర్లు ఎల్గురి అలివేలు చంటిబాబు, వల్దాసు లక్ష్మి శ్రీను, మెప్మా ఆర్పీలు, మహిళా సంఘాల సభ్యులు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మహిళా సాధికారత కు ప్రభుత్వం పెద్దపీట

-కేరళ తరహాలో తెలంగాణలో కూడా పేదరిక నిర్మూలనకు ప్రభుత్వం కృషి

-ప్రతి పేదవాడి కళ్ళల్లో ఆనందం చూడటమే సీఎం రేవంత్ రెడ్డి లక్ష్యం

-18 వ వార్డు కౌన్సిలర్ డాక్టర్ ఊర రామ్మూర్తి యాదవ్

-ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీ



భానుపురి /సూర్యాపేట టౌన్

మహిళల సాధికారత కు ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని, కేరళ తరహాలో తెలంగాణ రాష్ట్రంలో కూడా పేదరిక నిర్మూలనకు ప్రభుత్వం కృషి చేస్తుందని ప్రతి పేదవాడి కళ్ళల్లో ఆనందం చూడటమే సీఎం రేవంత్ రెడ్డి లక్ష్యమని ప్రముఖ వైద్యులు 18 వ వార్డు కౌన్సిలర్ డాక్టర్ ఊర రామ్మూర్తి యాదవ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని బుధవారం ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా 18 వ వార్డులో మహిళలకు ఇందిరా మహిళా శక్తి చీరలను పంపిణీ చేసి మాట్లాడారు. పేద ప్రజలకు సన్న బియ్యం, మహిళలకు ఉచితంగా బస్ సౌకర్యం , 200 యూనిట్ల లోపు గృహాలకు ఉచిత విద్యుత్తు, పేదలకు రెండు లక్షల ఇందిరమ్మ ఇండ్ల ను మంజూరు చేసిందని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తుందని చెప్పారు. రేవంత్ రెడ్డి ఆలోచన మా ఆలోచన విధానం అని ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా సంక్షేమానికి కృషి చేస్తామని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో మొత్తం ఆరు లక్షల ఇందిరమ్మ ఇండ్లు వస్తాయని, రోగులకు అందుబాటులో ఉండేలా ఆధునిక సదుపాయాలతో ఉస్మానియా ఆసుపత్రిని, 250 కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూళ్లను నిర్మిస్తుందని తెలిపారు. వికలాంగులకు పెంచిన పెన్షన్ ను ప్రభుత్వం అమలు చేసేలా కృషి చేస్తుందని పేర్కొన్నారు. తెల్ల రేషన్ కార్డు ఉన్న పేదవారికి ఐదు లక్షల జీవిత భీమాను కల్పిస్తుందని అది కుటుంబానికి ఎంతో భరోసాను కల్పిస్తుందని అన్నారు. ప్రతి పేదవాడు గుడిసెలో నివసించ కుండా పేదల అభ్యున్నతికి కృషి చేస్తుందని అన్నారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు మాలోతు కమల చంద్రు నాయక్, నిమ్మల వెంకన్న, ధర్మానాయక్, మేరుగు రమేష్, కట్కూరి శేఖర్ రెడ్డి, బానోతు చాంప్లా, శంకర్ నాయక్, వార్డ్ ఆఫీసర్ నాగార్జున, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

## కేసుల నిర్వహణలో జిల్లా క్రైమ్ రికార్డ్ బ్యూరో కేంద్ర బిందువుగా పనిచేయాలి

భానుపురి/సూర్యాపేట ఎస్పీ కార్యాలయం



ఫంక్షన్ వర్టికల్ నిర్వహణ, కేసుల నిర్వహణ, డిజిటలైజేషన్, కేసుల స్థితిగతుల నమోదు లో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ పై అంశాలపై జిల్లా క్రైమ్ రికార్డ్ బ్యూరో పోలీసు అధికారులు, సైబర్ వారియర్స్, ఐటి సాంకేతిక సిబ్బందితో జిల్లా పోలీస్ కార్యాలయం నందు ఎస్పీ నర్సింహా ఐపీఎస్ గారు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ సైబర్ నేరాలలో బాధితులకు వేగవంతమైన సేవలు అందించాలని అధికారులకు సూచించారు. ముఖ్యంగా సైబర్ నేరాల్లో రూ.50 వేల లోపు డబ్బు కోల్పోయిన బాధితులకు మనీ రిస్టోరేషన్ మేనేజ్‌మెంట్ పోర్టల్ ద్వారా త్వరితగతిన రీఫండ్ అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మిస్సింగ్ కేసు చేదనకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి, పెండింగ్ కేసులను త్వరితగతిన ఛేదించాలని సూచించారు. కోర్టు డ్యూటీ అధికారులు సిఎంఎస్ (కోర్టు మానిటరింగ్ సిస్టమ్)లో ప్రతిరోజూ కోర్టులో జరిగిన కార్యకలాపాలు, హియరింగ్స్, సమన్లు, సీసీ నంబర్లు తదితర వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో అప్‌డేట్ చేయాలని తెలిపినారు. రాత్రి వేళల్లో నిర్వహిస్తున్న నైట్ బీట్, పెట్రోలింగ్ వ్యవస్థపై ప్రత్యేక దృష్టి సారించాలని, పెట్రోలింగ్ వాహనాల్లో ఏర్పాటు చేసిన జీపీఎస్ వ్యవస్థ పర్యవేక్షించాలని ఆదేశించారు. దొంగతనాల నియంత్రణలో బీట్ అధికారులు, పెట్రో కార్లు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. స్టేషన్ రైటర్లు, టెక్నికల్ టీం సిబ్బంది ప్రతి డేటాను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, వివిధ కేసుల్లో నిర్దేశిత కాలవ్యవధిలో చార్జిషీట్లు దాఖలు చేసేలా ఎస్‌హెచ్ఓలకు సహాయకారిగా ఉండాలని సూచించారు. దఈ కార్యక్రమంలో డిసిఆర్బి డిఎస్పి రవి, డిసిఆర్బి ఇన్స్పెక్టర్ మగ్దూం అలి, ఎస్ఐ లు యాకూబ్, ఘాన్సి రాణీ, ఐటి కోర్ అర్ఎస్ఐ రాజశేఖర్, సైబర్ వారియర్స్, టెక్నికల్ టీం సిబ్బంది ఉన్నారు.

## డబ్బులు ఎక్కువ ఇసుక తక్కువ

భానుపురి/సూర్యాపేట టౌన్



సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఇండ్ల నిర్మాణాలు చేసుకునేందుకు ఇసుకను ఆన్లైన్లో బుక్ చేస్తే ఆన్ లైన్ లో చూపించిన వెయిట్ రావడం లేదని దీంతో తాము తీవ్రంగా నష్టపోతున్నామని సూర్యాపేట జిల్లా కేంద్రానికి చెందిన ప్రముఖ బిల్డర్ ఫారూఖ్, ఆందోళన వ్యక్తం చేశారు. తాము ఆన్లైన్లో బుక్ చేసుకునే సమయంలో ఐదు టన్నుల ఇసుకకు 4319 రూపాయలు చెల్లించామని కానీ మాకు మూడున్నర నుంచి నాలుగు టన్నులు మాత్రమే ఇసుక రావడంతో సుమారు టన్నుపైన ఇసుక నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. తాము చెల్లించిన డబ్బులకు సరిపడా ఇసుక రాకపోవడంతో ట్రిప్పుకు వెయ్యి రూపాయల చొప్పున తాము 500 ట్రిపుల వరకు ఇప్పటి వరకు బుక్ చేసుకొని దిగుమతి చేసుకన్నామని సుమారు 5 లక్షల రూపాయలు నష్టపోయామని అన్నారం ఆన్లైన్లో చూపించిన ధరను మేము చెల్లిస్తున్నప్పుడు మాకు రావాల్సిన వెయిట్ ఇసుక ఎందుకు రావడం లేదని ప్రశ్నించారు. బుధవారం తమ వద్దకు మూడు ట్రాక్టర్లు రాగా వెయిట్ వేయిస్తే మూడు ట్రాక్టర్లలో కూడా టన్నుకు పైగా ఇసుక తక్కువగా ఉందన్నారు. ఇసుక తక్కువ వస్తుందని నిరూపించేందుకు వే బ్రిడ్జ్ కాంటాలు కూడా వేయించి పరిశీలించామన్నారు. ఇది కాకుండా ఇసుక తీసుకువచ్చిన డ్రైవర్లు 200 రూపాయల బత్తా డిమాండ్ చేస్తున్నారని బత్తా ఇవ్వకుంటే బెదిరింపులకు పాల్పడుతున్నారని అన్నారు. తాము ఆన్లైన్లో చూపిన డబ్బులు చెల్లిస్తున్నప్పుడు డ్రైవర్లకు బత్తా ఎందుకు ఇవ్వాలని అన్నారు. ఈ విషయమై ఉన్నతాధికారులు స్పందించి ఇసుక ఎందుకు తక్కువ వస్తుందో తగిన విచారణ చేసి మాకు న్యాయం చేయాల్సిందిగా డిమాండ్ చేశారు. ఈ విషయమై తాము కోర్టుకు వెళ్లడంతో పాటు కలెక్టర్కు ఫిర్యాదు చేస్తామన్నారు. వారి వెంట తాఫీ పనివార్ల సంఘం అధ్యక్షులు రెబల్ శ్రీనివాస్,సాజిద్ ఖాన్,ఇతర బిల్డర్లు మేస్త్రీలు ఉన్నారు.

## మెట్లపై జర్నలిస్టులు... కుర్చీలపై నాయకులు..

భానుపురి/సూర్యాపేట టౌన్



జిల్లా కేంద్రంలోని రాజీవ్ చౌరస్తా 22,23వ వార్డు ల లో నిర్వహించిన ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమంలో ఓ చేదు దృశ్యం కనిపించింది. సమాజానికి దారిచూపే జర్నలిస్టులు విధి నిర్వహణలో భాగంగా మెట్లపై కూర్చొని వార్తలను సేకరిస్తుండగా, నాయకులు మాత్రం కుర్చీలపై ఆసీనులై కార్యక్రమాన్ని కొనసాగించడం చర్చనీయాంశమైంది. ప్రజల సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లేది జర్నలిస్టులే... నాయకులను ప్రజల్లో హీరోలుగా నిలబెట్టేది కూడా మీడియానే. కానీ అలాంటి జర్నలిస్టులకు కనీస గౌరవం, సరైన స్థానం కల్పించడంలో నిర్వాహకులు విఫలమవడం బాధాకరం. “మేము ఎలా కూర్చున్నాం అన్నది కాదు... ప్రజలకు ఏమి చేరవేశాం అన్నదే ముఖ్యం” అనే తత్వంతో పనిచేసే జర్నలిస్టుల అంకితభావం ఈ ఘటనలో మరోసారి బయటపడింది. ఎండైనా... వానైనా... అర్ధరాత్రైనా... ప్రమాద పరిస్థితులైనా ప్రజల కోసం పరుగులు తీసే జర్నలిస్టుల సేవలను చాలామంది అవసరం వచ్చినప్పుడే గుర్తిస్తారు. “కంట్లో నలుసు పడితేనే నలుసు విలువ తెలుస్తుంది” అన్నట్లుగా మీడియా విలువ కూడా పరిస్థితులు ఎదురైనప్పుడే అర్థమవుతుంది. గౌరవం తగ్గినా... ఒత్తిళ్లు పెరిగినా... వృత్తి పట్ల నిబద్ధత మాత్రం తగ్గదు. ఎందుకంటే జర్నలిజం అనేది కేవలం ఉద్యోగం కాదు... ప్రజాస్వామ్యాన్ని నిలబెట్టే బాధ్యత...

## దేశ నిర్మాణంలో నెహ్రూ సేవలు అమోఘం


భానుపురి /సూర్యాపేట



భారతదేశ తొలి ప్రధానమంత్రి జవహర్ లాల్ నెహ్రూ దేశ నిర్మాణంలో చేసిన సేవలు చిరస్మరణీయమని ఎఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి అన్నారు. బుధవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని 22వ వార్డు చౌరస్తాలో నెహ్రూ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్యం అనంతరం దేశాభివృద్ధికి నెహ్రూ బలమైన పునాదులు వేశారని తెలిపారు. పరిశ్రమలు, విద్యాసంస్థలు, ప్రజాస్వామ్య వ్యవస్థలను బలోపేతం చేయడంలో ఆయన పాత్ర విశేషమని కొనియాడారు. శాస్త్రీయ దృక్పథంతో దేశాన్ని అభివృద్ధి దిశగా నడిపించిన మహానేత నెహ్రూనేనని పేర్కొన్నారు. ఐఐటీలు, పరిశోధనా సంస్థలను స్థాపించి యువతకు కొత్త అవకాశాలు కల్పించారని, నేడు భారత్ ప్రపంచస్థాయిలో ఎదగడానికి ఆయన దూరదృష్టే కారణమని అన్నారు. దేశం కోసం కాంగ్రెస్ పార్టీ, నెహ్రూ కుటుంబం చేసిన త్యాగాలను ప్రజలు ఎప్పటికీ మర్చిపోరని తెలిపారు. నెహ్రూ ఆశయాలను యువత ఆదర్శంగా తీసుకుని దేశాభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డిసిసి అధ్యక్షుడు గుడిపాటి నరసయ్య, పీసీసీ ప్రధాన కార్యదర్శి చకిలం రాజేశ్వరరావు, మున్సిపల్ చైర్మన్ మొరిశెట్టి నివేదిత లక్షాధి, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అంజద్ ఆలీ, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కుమ్మరి కుంట్ల వేణుగోపాల్, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్టీఆర్ కు భారతరత్న ప్రకటించడమే ఘన నివాళి

భానుపురి/సూర్యాపేట టౌన్




యుగపురుషుడు, భారతీయ చలనచిత్ర నటుడు, ప్రజల ఆరాధ్య దైవం తన చిరస్మరణీయ నటన అందరి హృదయాలలో చిరస్థాయిగా నిలిచి, ప్రపంచంలోనే నేటికీ ఎవరూ అధిగమించలేని రికార్డుతో 9 నెలల కాలంలోనే రాజకీయ రంగ ప్రవేశం చేసి ఉమ్మడి తెలుగు రాష్ట్ర ముఖ్యమంత్రిగా సేవలందించి, పలు ప్రజాసంస్కరణలతో రాజకీయ చైతన్యం కలిగించిన ఎన్టీఆర్ మహా వ్యక్తి అని 1975 సూర్యాపేట ఎన్టీఆర్ అభిమాన సంఘ అధ్యక్షుడు, సామాజికవేత్త గుండా రమేష్ బుదవారం ఒక ప్రకటనలో స్మరించుకున్నారు. ఎన్టీఆర్ 103వ జయంతి సందర్భంగా రమేష్ మాట్లాడుతూ ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం ఎన్టీఆర్ కు భారతరత్న ప్రకటించాలని, ఈ అరుదైన ప్రతిష్టాత్మకమైన పురస్కారమే ఆయనకు నిజమైన ఘన నివాళి అని తెలిపారు.